క్లుప్తంగా

గురుకుల పాఠశాలకు విద్యుత్ లైట్లు అందజేత


విద్యుత్ లైట్లు అందజేస్తున్న ఎస్సై శ్రీకాంత్

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలు గురుకుల బాలికల పాఠశాలలోని బాలికల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ లైట్లు అందజేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎస్పీ దామోదర్ ఆదేశాలతో పాఠశాలను సందర్శించిన సిబ్బంది అక్కడి అవసరాలకు అనుగుణంగా సమస్యలు గుర్తించి ప్రాథమికంగా విద్యుత్ లైట్లు ప్రిన్సిపాల్ శైలజ ప్రియదర్శినికి అందజేసినట్లు ఆయన వివరించారు.

రీసర్వే గ్రామసభలకు 460 అర్జీలు

సంతనూతలపాడు: మండలంలో రీ సర్వే రెవెన్యూ గ్రామసభలకు 460 అర్జీలు రైతుల నుంచి ఆయా గ్రామ సభల్లో వచ్చినట్లు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి తెలిపారు. లక్ష్మీపురంలో సోమవారంతో రీ సర్వే రెవెన్యూ గ్రామసభలు ముగిసాయన్నారు. అక్టోబర్ 22న గుడిపాడులో ప్రారంభమైన గ్రామసభలు నవంబర్ 6న లక్ష్మీపురంతో ముగిసాయన్నారు. గుడిపాడులో 48 అర్జీలు, కొనగానివారిపాలెంలో 15 అర్జీలు, ఎనికపాడులో 12 అర్జీలు, గుమ్మలంపాడులో 90 అర్జీలు, చిలకపాడులో 90 అర్జీలు, తక్కెళ్లపాడులో 40, మంగమూరులో 79, గురువారెడ్డిపాలెంలో 36, రుద్రవరంలో 30, లక్ష్మీపురంలో 20 అర్జీలు రైతుల నుంచి వచ్చినట్లు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి వెల్లడించారు. ఆయా అర్జీల సమస్యలను 45 రోజుల్లో పరిష్కరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

మద్దిపాడు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 7వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఘనంగా బండారు రామారావు వర్ధంతి

ఒంగోలు వన్‌టౌన్: గాయకుడు బండారు రామారావు వర్ధంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు నెల్లూరు బస్టాండ్ సమీపంలోని రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో బండారు రామారావు తమ పద్యాలతో పద్యప్రియులను ఓలలాడించారన్నారు. యాదాల రాజశేఖర్, శ్రీపతి ప్రకాష్, ఎద్దు శశికాంత్ భూషణ్, వేమా శ్రీనివాసరావు, అల్లూరు శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్టు

ఒంగోలు టౌన్: నగరంలోని మంగమూరు రోడ్డులో ఒక గదిలో పేకాట శిబిరంపై తాలుకా సీఐ కె. అజయ్ కుమార్ ఆధ్వర్యంలోని పోలీసుల బృందం దాడి చేసి పట్టుకుంది. ఈ దాడిలో 12 మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 2.36 లక్షల రుపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

జలం.. విషతుల్యం


చర్చి సెంటర్ వద్ద లీకేజ


రామనగర్ 10వ లైన్ వద్ద..


సంతపేట, బలరాం ఇంటి వద్ద లీకేజీ

- మంచి నీటి పైపులైన్ లీకేజీతో తాగు నీరు కలుషితం
- మరమ్మతులు చేయకుంటే రోగాలు తప్పవు

ఒంగోలు వన్‌టౌన్:

మంచి నీటి పైపులైన్ లీకేజీతో తాగు నీరు కలుషితమవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఒంగోలు వాసులు వాపోతున్నారు. సంతపేట, అన్నవరప్పాడు, రామనగర్ తదితర ప్రాంతాల్లో మంచి నీరు వదిలే రోజు పైపు లైన్‌లకు లీకేజీలు ఉండటంతో రోడ్లపై నీరు చేరుతోంది. కొన్ని చోట్ల కాలువల పక్కన ఉన్న పైప్‌లైన్‌లు లీకేజీ అవతుండటంతో మంచి నీరు కలుషితం అవుతోంది. ఆయా ప్రాంతాల్లో దాదాపు 10000 మందికి పైగా ప్రజలు ఇలాంటి నీరు తాగాల్సి వస్తోంది. ఈ కుళాయిల ద్వారా వచ్చే నీరు దుర్వాసన వస్తూ తాగడానికి పనికిరాని విధంగా ఉన్నాయి. కలెక్టరేట్ వద్ద పెద్ద చర్చి పక్కనే 10 రోజుల నుంచి పైపులైన్ లీకేజీ అవుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇలా నీరు వృథా చేస్తే వేసవి కాలంలో తాగు నీటికి తీవ్ర ఎద్దడి వచ్చే ప్రమాదం నెలకొంది. ఇదిలా ఉంటే సంతపేట లోని మాజీ ఎమ్మెల్యే బలరాం ఇంటి ముందు కూడా మంచి నీరు వదిలే రోజు రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. రామనగర్ 10వ లైన్‌లో మంగళవారం మంచి నీరు వదలడంతో లైన్‌లో సగభాగం కాలువలా మారింది. మంచి నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట వేడుకలు

- విగ్రహ ప్రతిష్ట రేపు
- గ్రానైట్ రాళ్లతో అద్భుతంగా తీర్చిదిద్దిన నిర్వాహకులు


నూతనంగా నిర్మించిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయం

చీమకుర్తి: స్థానిక గరికమిట్టలో శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట వేడుకలు బుధవారం నుంచి మూడు రోజులు పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. గ్రానైట్ రాళ్లతో అద్భుతంగా నిర్మించి ఆలయంలో శ్రీమద్గణపతి, లక్ష్మి, కృష్ణ, ధ్వజ, శిఖర కలశ సహిత, సీతా లక్ష్మణ, హనుమత్సమేత శ్రీసీతారామాంజనేయస్వామి వారలకు చెందిన విగ్రహాలతో పాటు నూతన ప్రారంభ వేడుకలు 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 6న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విశేష పూజలు, 7న హోమాలు, 8న ఉదయం యంత్ర పూజతో పాటు ఉదయం 7.15 గంటలకు విగ్రహ ప్రతిష్టా వేడుకలు, 7.45 గంటలకు ధ్వజ స్తంభ ప్రతిష్టా వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకల్లో భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామి వారి దర్శించుకొని అన్నప్రసాదాలు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

రైతులు సలహాలు తీసుకోవాలి


మద్దిపాడు: దొడ్డవరంలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ రమేష్

మద్దిపాడు: రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది సలహాలు తీసుకుంటూ పంటలు వేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి కె. రమేష్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని దొడ్డవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు వ్యవసాయ సంబంధిత పథకాల గురించి వివరించారు. వరి పంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని దొడ్డవరం, గుండ్లాపల్లి గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారి ఆధ్వర్యంలో పొగాకు రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఓ రమేష్ పాల్గొన్నారు. ఆయన పొగాకు రైతులతో మాట్లాడుతూ ఈ సంవత్సరం రబీ సీజన్‌లో పొగాకు సాగు విస్తీర్ణం ఎక్కువ ఎకరాల్లో వేయడానికి రైతులు సిద్ధ పడుతున్నారని, ఈ క్రమంలో రైతులు పొగాకు కొనుగోళ్ల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. రైతులు పొగాకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన శనగ, మినుము పంటలు సాగు చేయాలని కోరారు. ఆయన వెంట విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు స్పందన, శిరీష, సాయి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రూ. 6 వేల కోట్ల విద్యుత్ భారం

ఒంగోలు వన్‌టౌన్: విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై 6 వేల కోట్ల రూపాయల భారం వేయడం కూటమి ప్రభుత్వ దగా కోరుతనానికి నిదర్శనమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే సైదా మంగళవారం అన్నారు. ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఇచ్చి పేదల కుటుంబాల్లో వెలుగులు నింపామని చెప్పుకునే ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. నిత్యం పెరిగే నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలతో ప్రజలు సతమతమవుతుంటే విద్యుత్ సర్దుబాటు చార్జీలను ప్రజలపై మోపడం మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా ఉందన్నారు. ఉచిత సిలిండర్ల పథకం కింద ఎడాదికి పేదలకు ఇచ్చేది రూ. 2,685 కోట్లు అయితే ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేసేది 6 వేల కోట్లు అని విమర్శించారు. కరెంటు బిల్లుల రూపంలో పేదల కుటుంబాలలో డబుల్ ఇంజన్ సర్కార్ చీకట్లను నింపుతోందన్నారు. గత ప్రభుత్వం 9 సార్లు విద్యుత్ చార్జీలను పెంచిందని, తాము అధికారంలోకి వస్తే 1 రూపాయి కూడా అదనపు భారం మోపమని, అవసరం అయితే 35 శాతం విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని మాయమాటలు చెప్పి కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. దీనికి నిరసనగా ఈ నెల 7వ తేదీన విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని తెలపనున్నట్లు తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో గాయత్రి సత్తా


అభివాదం చేస్తున్న గాయత్రి

ఒంగోలు: స్థానిక నారాయణ ఒలింపియాడ్ స్కూలులో 9వ తరగతి చదువుతున్న ఎస్.గాయత్రి జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తాచాటడమే కాకుండా రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు తెనాలిలో జరిగిన అండర్ 17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచింది. 45 కేజీల బాడీ వెయిట్ కేటగిరీలో స్నాచ్ 25 కేజీలు, జెర్క్ 34 కేజీలు చేసి ఔరా అనిపించింది. పవర్ లిఫ్టింగ్‌లో ఖ్యాతి గడించిన గుంటి చంద్రశేఖరరావు కుమార్తె గుంటి రాజరాజేశ్వరి ప్రస్తుతం ప్రకాశం జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారిగా పనిచేస్తున్నారు. ఈమె పవర్ లిఫ్టింగ్‌లో వరల్డ్ చాంపియన్‌గా నిలిచారు. ఈమె కుమార్తె గాయత్రి కూడా తల్లికి తగ్గ కూతురిగా అభినందనలు అందుకుంటోంది.

పల్లెవెలుగు ప్రయాణికులకు బహుమతులు


ఆర్టీసీ ఆవరణలో డ్రా తీస్తున్న డిపో మేనేజర్ తదితరులు

ఒంగోలు టౌన్: పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే వారిని ప్రోత్సహించేందుకు గాను మంగళవారం ఆర్టీసీ డిపో ఆవరణలో డ్రా నిర్వహించారు. డిపో మేనేజర్ డి. శ్రీనివాసులు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఆర్ఎం నాయక్, సీఎంఆర్ జ్యూయలరీస్ అధినేత మావూరి శ్రీనివాసరావులు డ్రా తీశారు. ఈ డ్రాలో తాళ్లూరు రూట్లో ప్రయాణించిన విశాఖ పట్నంకు చెందిన ఆర్‌పీఆర్ విఠల్, కొణిజేడు రూట్లో ప్రయాణించిన రత్నం, గుండాయపాలెం రూట్లో ప్రయాణించిన అన్నకు బహుమతులు లభించాయి. గిఫ్ట్ స్కీమ్ డ్రాను ప్రతి 15 రోజులకు ఒకసారి తీస్తామని డిపో మేనేజర్ తెలిపారు.

స్కిల్ సెన్సెస్‌పై సచివాలయ ఉద్యోగులకు శిక్షణ


సంతనూతలపాడు: సమీక్షిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు


సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న హిమాంబీ

నాగులుప్పలపాడు: మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బందికి నైపుణ్య గణన శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కిల్ సెన్సెస్ ట్రైనర్ హిమాంబీ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటినీ సచివాలయ ఉద్యోగులు సందర్శించి ఆ ఇంట్లో ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారి వివరాలను నైపుణ్య దర్శిని యాప్‌లో నమోదు చేయించాలని సూచించారు. వారి ప్రతి నైపుణ్యాన్ని యాప్‌లో నమోదు చేయిస్తూ పూర్తి వివరాలు, సర్టిఫికెట్ కూడా యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ విధంగా చేస్తే నైపుణ్యం ఉండి ఉద్యోగాలు లేని వారికి అవకాశం కల్పించవచ్చని తెలిపారు. శిక్షణలో కార్యాలయ సూపరింటెండెంట్ దక్షిణామూర్తి, ట్రైనర్స్ సురేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

సంతనూతలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్కిల్స్ సెన్సెస్ (స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్) సమావేశం మంగళవారం జరిగింది. ఎంపిడివో సురేష్ బాబు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ ఏదో ఒక రంగంలో నైపుణ్యం కలిగి ఉంటారని, అలాంటి నైపుణ్యాలను గుర్తించి సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ సర్వే చేయించి రాబోవు రోజుల్లో కల్పించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉండాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెన్సెస్ కో ఆర్డినేటర్ బాషా, పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రానైట్ సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల

చీమకుర్తి: జిల్లాలో గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. రామతీర్థం వీటీసీ కేంద్రంలో చీమకుర్తి, బూదవాడ, ఆర్.ఎల్.పురం పరిధిలో ఉన్న అన్ని గ్రానైట్ ఫ్యాక్టరీల అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి సంతనూతలపాడు, మార్కాపురం ఎమ్మెల్యేలను ఆహ్వానించగా మార్కాపురం ఎమ్మెల్యే మాత్రమే హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ సంతనూతలపాడు ఎమ్మెల్యేతో కలిసి చీమకుర్తి గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. ఫ్యాక్టరీల యజమానులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని చీమకుర్తి ఫ్యాక్టరీల అసోసియేషన్ అధ్యక్షుడు కాట్రగడ్డ రమణయ్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సబ్సిడీలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దాదాపు 400 ఫ్యాక్టరీల యజమానులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నూరు శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దుదాం



ఉల్లాస్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చీమకుర్తి: మండలంలో నూరు శాతం అక్షరాస్యులు ఉండేలా తీర్చిదిద్దుదామని ఏఓ వజ్జా శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అక్షరాస్యతను సాధించేందుకు ఉల్లాస్ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు మంగళవారం చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డిజిటల్, ఫైనాన్షియల్, ఫంక్షనల్ అక్షరాస్యతల్లో సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు స్వయం సహాయక గ్రూపుల్లో చదువుకున్న మహిళలు స్వచ్ఛందంగా ముందుకొస్తే వారిని వలంటీర్ టీచర్‌లుగా నియమించి అక్షరాస్యతలో ప్రతి గ్రామంలో నూరు శాతం సాధించేందుకు కృషి చేద్దామని సాంకేతిక సిబ్బంది, ఏపీఎం కోరారు.

సుప్రీం తీర్పు రాజ్యాంగ విరుద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న మల్లెల వెంకట్రావు

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు తీర్పు రాజ్యంగ విరుద్ధమని మాల మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు అన్నారు. ఒంగోలు అంబేద్కర్ గ్రంథాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ సహజ న్యాయ సూత్రాలు, రాజ్యాంగ నిబంధనలు అతిక్రమించి, ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్ తీర్పు ఇచ్చారన్నారు. ఎస్సీ వర్గీకరణ ఆర్టికల్ 16(4) ప్రకారం రాజ్యాంగ బద్ధం అని, వర్గీకరణ క్రీమిలేయర్‌లు రాష్ట్రాలు అమలు చేసే అధికారం ఉందని చెబుతున్న సుప్రీం కోర్టు ఉదాహరణగా ఇందిరా సహానీ కేసును ప్రస్తావిస్తున్నారన్నారు. 1992వ సంవత్సరంలో 9 మంది న్యాయమూర్తులు ఎస్సీ, ఎస్టీలకు క్రీమిలేయర్ వర్తించదని తీర్పు చెప్పారని గుర్తు చేశారు. కేసు విచారణ బహిరంగంగా కోర్టులో చేయాల్సి ఉంటే చాంబర్‌లో పిటిషన్‌లను కొట్టివేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం అన్నారు. దీనికి నిరసనగా ఈ నెల 9న చీరాలలో అంబేద్కర్ భవన్‌లో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డి. కృష్ణ, చప్పిడి వెంగళరావు, సంపత్ కుమార్, ఎద్దు శశికాంత్ భూషణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చీమకుర్తి విద్యార్థులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన హైస్కూలు క్రీడాకారిణిలతో పీడీ

చీమకుర్తి: చీమకుర్తి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారిణిలు రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ డి.స్వరూపావాణి తెలిపారు. అండర్-14 విభాగంలో అక్షయ, మేఘన, అండర్-17 విభాగంలో ప్రియాంక ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 6, 7 తేదీల్లో అండర్ -14 పోటీలు అన్నమయ్య జిల్లాలోని అంగళ్ల గ్రామంలో, అండర్-17 పోటీలు రాజమండ్రిలో జరుగుతాయన్నారు. జిల్లా తరపున ఎంపికైన వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న సందర్భంగా జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల టీచర్‌లు, తోటి విద్యార్థులు అభినందించారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

కొత్తపట్నం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను రెండో పట్టణ సీఐ మేడా శ్రీనివాసరావు మంగళవారం తనిఖీ చేశారు. మండలంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పలు సీసీ కెమెరాలు ఉచితంగా ఇవ్వాలని కోరారు. వీటివల్ల నేరాలు నియంత్రించవచ్చన్నారు. కొత్తపట్నం ఎస్సై వి.సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం అద్భుతం

కొత్తపట్నం: ప్రకృతితోనే ప్రకృతి వ్యవసాయం చాలా అద్భుతంగా ఉందని కొత్తపట్నం మండలంలో ప్రకృతి వ్యవసాయం బాగా చేస్తున్నారని సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డీవీ రాముడు అభినందించారు. మండల రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాలను జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిని ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించారు. వికాస్ రెడ్డి, మహేష్‌రెడ్డి, నరసింహులు, రెడ్డెప్ప, శ్రీకాంత్, ప్రసంగి, ఆదిత్యరామ్, సౌమ్య, ఇందిర, శశి పాల్గొన్నారు.

పుట్టలోని నాగయ్య... పూజలందుకోవయ్యా...


జంట నాగేంద్ర స్వామికి పాలు పోసి మొక్కులు తీర్చుకుంటున్న మహిళా భక్తులు


ప్రత్యేక అలంకరణలో సంతనూతలపాడు త్రిపురాంతక స్వామి


సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం పుట్టలో పాలు పోస్తున్న దుంపా

ఒంగోలు మెట్రో: కార్తీక మాసం మంగళవారం నాగుల చవితి పండగ సందర్భంగా జిల్లావ్యాప్తంగా మహిళా భక్తులు పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఒంగోలు నగరంలో కొండమీద స్కందగిరి దగ్గర ఉన్న నాగేంద్ర స్వామి పుట్టలో, మంగమూరు రోడ్డు ఐశ్వర్య నగర్లో వల్లి దేవసేన నాగేంద్ర స్వామి పుట్టలో, శ్రీరామ్ కాలనీలో బ్రహ్మంగారి మందిరాలు, నాగేంద్ర స్వామి పుట్టలో పాలు పోశారు. ఒంగోలు రంగారాయుడు చెరువు దగ్గర వెలసి ఉన్న నాగేంద్ర స్వామి పుట్టలో, సంతపేట షిరిడి సాయిబాబా మందిరంలో నాగేంద్ర స్వామి పుట్టలో తెల్లవారుజామునుండే మహిళా భక్తులు బారులు తీరారు. జంట నాగేంద్ర స్వాములకు పాలు, చలిమిడి నైవేద్యంగా పెట్టి దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పడగ తొక్కితే పగవాడు అనుకోకు, నడుము తొక్కితే నా వాడు అనుకో, తోక తొక్కితే తొలగిపోవు, గుమ్మపాలు తాగి వెళ్లిపోవయ్యా. అంటూ పుట్టలోని నాగేంద్ర స్వామి ని మొక్కుకున్నారు. నగరంలోని సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానాలు మంగళవారం చవితి తిథి నాగుల చవితి పండగ కలిసి రావడంతో సుబ్రహ్మణ్య స్వామికి ఆలయ అర్చకులు అభిషేకాలు అర్చన క్రతువులు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సుబ్రహ్మణ్యస్వామి దర్శనం చేసుకున్నారు.

వైభవంగా నాగుల చవితి వేడుకలు

సంతనూతలపాడు: మండలంలో మంగళవారం నాగులచవితి వేడుకలు వైభవంగా జరిగాయి. కార్తీక మాస నాగుల చవితి సందర్భంగా సంతనూతలపాడులోని త్రిపురాంతక స్వామి ఆలయంలో మహిళలు అధిక సంఖ్యలో పుట్టలో పాలు పోసి తమ మొక్కు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు ఎస్.బుజ్జిబాబు శర్మ ఆధ్వర్యంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఎండోమెంట్ ఈవో ఎన్.నారాయణరెడ్డి వేడుకలను పర్యవేక్షించారు. శ్రీనాగేంద్ర, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా షష్టమ వార్షికోత్సవం జరిగింది. ఆలయ అర్చకులు ఆదిమూలం శ్రీసాయి శర్మ బృందం ఆధ్వర్యంలో స్వామి వార్లకు సుప్రభాత సేవ, వేద పారాయణం, గణపతి పూజ, పుణ్యాహ వచనం, పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చన, గణపతి హోమం, లక్ష్మీగణపతి హోమం చేశారు. ప్రముఖ వాస్తు సిద్ధాంతి అయినాల నాగేశ్వరాచారి వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై పుట్టలో పాలు పోసి మొక్కు తీర్చుకున్నారు. మాజీ ఎంపీపీ దుంపా చెంచి రెడ్డి, జెడ్పీటీసీ రమణమ్మ దంపతులు పుట్టలో పాలు పోసి శివునికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా 54 మంది దంపతులు హోమ పూజలో కూర్చున్నారు. వేడుకల్లో భాగంగా భారీ ఎత్తున అన్నదానం చేశారు. వేడుకలను దేవాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు సన్నమూరి సుబ్బనాచారి, ఎం.రాజేష్ గుప్తా, బి.శ్రీనివాసరావు, టి.శరత్‌బాబు, వి.జ్వాలా ప్రభాకరరావు, కొండమ్మ పర్యవేక్షించారు.

కొత్తపట్నం: మండలంలో మహిళలు సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం పూజలు చేశారు. పుట్ట చుట్టూ పువ్వులు, పసుపు, కుంకమ, అరిటికాయలు దారంతో అలంకరించారు.



ఒంగోలులో పూజలు చేస్తున్న మహిళలు


ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పక్కన రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, బూచేపల్లి శివప్రసాద రెడ్డి, వెంకాయమ్మ, కాకుమాని రాజశేఖర్, కటారి శంకర్, కుప్పం ప్రసాద్ తదితరులు